# ఉసురు

## 'సాంబయ్యా'...

ఉరుములాంటి ఆ పిలుపుకి, అదిరిపోతూ, గొంతెండి పోతూన్నట్టనిపిస్తూ వుండే తిరిగి చూశాడు. ఎవ్వరూ లేరు! నాలుగు వైపులా కలయ జూశాడు గేటు కాపలా దారు తప్ప!, ఆ దరిదాపుల్లో ఎవ్వరూ కనిపించలేదు.

తన పిచ్చిగానీ, ఇక్కడి కెవరొస్తారు? ఒచ్చినా, తనని "సాంబశివరావుగారూ" అని తప్ప "సాంబయ్యా" అని పిలిచే ధైర్యం ఎవరికుంది?_ తనని తాను సమాధాన పరచుకున్నాడు.

అయినా, ఆ పిలుపు పదే పదే జ్ఞాపకం ఒస్తూ, కడుపులో కెలికినట్టయింది! గతం కళ్ళముందు కదిలి మనస్సును సలిపేస్తోంది. శరీరం ఒణకడం మొదలుపెట్టింది "కొంపదీసి, ఆమె పిశాచ రూపంలో ఇక్కడ ప్రత్యక్షం కాదుకదా! ఒకవేళ అయితే! తనని ప్రాణాలతో వుంచుతుందా? తలుచుకున్న కొద్దీ కాళ్లు రెండూ కొట్టుకుంటున్నాయి. మైకం కమ్మినట్టయి తూలిపోయాడు సాంబయ్య....కాదు సాంబశివ రావుగారు.

❋❋❋❋

సరిగ్గా పాతిక సంవత్సరాల నాడు జరిగిన సంఘటన మనో ఫలకంపైన, వెండి తెరమీద బొమ్మల్లా కనబడింది! ఆరోజు ....రమణయ్యగారు గుండెపోటుతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. పార్వతమ్మ కన్నీళ్ళు గుండెల్లోని మంటలని ఆర్పలేక పోతున్నాయి. కంచి కామాక్షి మొదలుకుని కనకదుర్గమ్మ వరకూ దండాలు పెట్టుకుంది, తన నొసటి కుంకుమ, కాపాడమని!

"సాంబయ్యా!" పిలిచాడు రామ్మూర్తి.

"సార్" దగ్గరగా వెళ్ళి చేతులు కట్టుకుని నుంచున్నాడు. "సాంబయ్యా! నాకో సాయం చేసి పెట్టాలి. ఇవి చేతులు కావు, కాళ్ళనుకో" చేతులు పట్టుకుని ప్రాధేయ పూర్వకంగా అడిగాడు రామ్మూర్తి.

"అదేంటిసార్! ఎంతమాట! నేనేం చెయ్యాలో చెప్పండి. తప్పకుండా చేస్తాను. "సాంబయ్యా! బావగారు బతకరంటున్నారు డాక్టర్లు"...."అవునుసార్! ఆదేముడు మనకింక లేకుండా పోతాడు. అయ్యగారు లేరని తెలుస్తే, అమ్మగారు ప్రాణాలు నిలుస్తయా సార్! ఆమెని తలుచుకుంటే భయంగా వుంది సార్! ఎలా బతుకుతారో ఏమిటో?" కంటతడి పెట్టుకున్నాడు సాంబయ్య.



"సాంబయ్యా! బావగారితో పాటు, మా అక్కా పోవాలి"

"అలా అనకండి సార్? నాకు తెలుసు మే బాధ! కానీ, మనకి అమ్మగారు కూడా లేకపోతే...."

"అదే! లేకపోతే ఏంచెయ్యాలి అని?

"మన చేతుల్లో ఏముంది సార్! ఆ భగవంతుడు ఎట్టా రాసిపెడితే, అట్టాగే జరుగుతుందీ."

"సాంబయ్య నువ్వు ఎట్టా రాస్తే, అట్టాగే జరుగుతుంది.

"సార్! ఏమిటి మీరంటున్నది?" అతని మాటలకి అర్థాన్ని వెతుకుతూ, అతని కళ్ళల్లోకి చూశాడు భయంగా.

"సాంబయ్యా! ఈ ఆస్తికి వారసులు, మా బావగారి బంధువు లెవరూ కాదు! కాకూడదు! నేనూ నా పిల్లలూ! అందుకు నీకేం కావాలో చెప్పు! ఎంత కావాలో చెప్పు—" రామ్మూర్తి మాటల్ని నమ్మలేక పోతున్నాడు సాంబయ్య. నోరు తెరబెట్టి చూస్తుండిపోయాడు.

"ఏమండీ! నన్నొదిలి ఎందుకు వెళ్ళిపోయారండీ? నేనేం కావాలనుకున్నారు? నన్నూ మీతోటే తీసుకుపోండి" పార్వతమ్మ గొంతు, భూమి దద్దరిల్లేలా వినిపిస్తోంది. రామ్మూర్తి అటు కేసి వెళ్ళాడు. వెనకాలే సాంబయ్య వెళ్లాడు.

❋❋❋❋

హైదరాబాదులో వున్న సుప్రసిద్ధమైన, ఆడిటింగ్ కంపెనీలో రమణయ్యగారిది, మొదటి స్థానమని చెప్పొచ్చు. దానికి




కారణం. రమణయ్యగారి మంచితనం. దాన ధర్మాల్లోనూ, దయా దాక్షిణ్యాల లోనూ, సాక్షాత్తూ ఆ ధర్మ రాజే ఈ రమణయ్య. అంటారు అంతే కానీ ఏనాటి పాపమో ఏనాటి శాపమో, వారికి సంతానం కలగలేదు. బంధువులూ, మిత్రులూ, అందరూ వారి బిడ్డలే! ఎప్పుడూ, సంతర్పణలూ, సమారాధనలూ, ఆ ఇల్లు నిత్య కళ్యాణం పచ్చతోరణం!


రమణయ్యగారి ఇల్లుతాకట్టు పెట్టారన్న వార్త, ఊరందరినీ ఆశ్చర్యంలోముంచింది. సిరిసంపదలకు మరో పేరు వీరిల్లు. అటువంటిది, ఇల్లు తాకట్టు ఎందుకు పెట్టవలసొచ్చిందో, సాంబశివరావ్ అండ్‌కంపెనీ "రామ్మూర్తి అండ్ సన్స్ వెలిసేదాకా, ఎవ్వరికీ తెలీలేదు. పార్వతమ్మ వేలి ముద్రల విలువ ఇంతటిదని ఆమె తెలుసుకున్న రోజున కుప్పగా కూలిపోయింది. కుమిలి కుమిలి ఏడ్చింది. అన్నం పెట్టిన చేతినే నరికేసిన సాంబయ్యనీ, రక్త సంబంధాన్నే అపవిత్రం చేసిన సహోదరుడ్ని క్షమించలేక శాపనార్థాలు పెట్టింది. చివరకు వారి మధ్యస ఇమడలేక, త్వరలోనే, తన భర్తను చేరుకుంది. కానీ, ఆమె కన్ను మూసేలోగా సాంబయ్యనీ రామ్మూర్తినీ చూసిన చూపులు బాకులకంటే పదునుగా గుచ్చుకున్నాయ్, వారి గుండెల్లో తూటాలకంటే దూకుడుగా దూసుకుపోయినయ్! ఆ చూపులు తలచుకున్నారంటే, భయంతో ఒణికిపోతారు. సాంబయ్య రామ్మూర్తులు పాతికేళ్ళుదాటినా ఆ చూపులు వీరు మరచిపోలేదు. ఎన్నో రాత్రులు నిద్రలేక, భయకంపితులై గడిపారు. తమ నీడని చూసి తామే భయపడుతూ, నిద్దర మాత్రలు వేసుకుని, కన్ను మూసుకోవడానికి ప్రయత్నించారు చివరకి రామ్మూర్తి, తాగుడికి బానిసై, లివర్ సిరోసిస్‌తో ప్రాణాలు విడిచాడు. అంత ఆస్తిని కాజేసి అక్కనే హింసించినా తన బిడ్డల బాగోగులు చూడలేక పోయాడు. అరటి చెట్లులా ఎదిగిపోయిన ఆడ పిల్లలు

## బాధాయణం

శ్రీరామ చంద్రునికి
అరణ్యవాసం
పాద రక్షలకేమొ
పట్టాభిషేకం
శక్తిని దిగమ్రింగె
యుక్తి చాతుర్యం
హక్కుల మ్రింగె
కైపెక్కిన స్వార్థం
ఆత్మభిమానము
అడవి పాలాయె
నీతీ నిజాయితీ
నిదురపాలాయె
మమత ఏడ్చి ఏడ్చి
మట్టిపాలాయె
బ్రతుకు బాధల గాధ
ఇతిహాసమాయె



—జె.బాపురెడ్డి




ఇంట్లోనే వుండిపోయారు కొడుకు పెళ్ళి చేసుకుని, ఇల్లరికానికి వెళ్లిపోయాడు.

సాంబయ్యకి బ్లైడ్ ప్రెషరు! తను కర్చుపెట్టే ప్రతీ రూపాయి మీదా ప్రభుత్వం వారి ఎంబ్లమ్ కాదు — పార్వతమ్మ మొహమే, కనిపిస్తున్నట్టుందేది. సాంబయ్య పిచ్చివాడై పోతున్నాడు. అందుకే, గుళ్ళు కట్టించాడు. అయితే, దానిమీద తనపేరే చెక్కించుకున్నాడు. బళ్ళు కట్టించాడు. తనపేరే పెట్టించాడు? అయినా భయం? భయం! ఏదో భయం! ఏదో ఒక రోజు పార్వతమ్మ ఉసురు తనకు కొడుతుందేమో నని భయం!

ఆ రోజున ఆఫీసునుంచి ఇంటికెళుతు వుంటే ఆమె కారుకడ్డంవొచ్చింది! ఎంత ప్రయత్నించినా ఆమెని రక్షించ లేక పోయాడు. ఆమె భర్త తనని దుర్భాష లాడడమే కాదు, చెయ్యి చేసుకున్నాడు కూడా. వాళ్ళ స్కూటర్ తుక్కుతుక్కయింది. కొత్త స్కూటర్ కొనిస్తానన్నాడు. కానీ కారు కింద పడ్డ అతని భార్యనెల ఇవ్వగలడు? అతను కేసు పెట్టాడు. తాగి కారు నడిపాడన్న తప్పుడు సాక్ష్యంతో. జైలు శిక్ష విధించారు! దాదాపు ఇరవై నాలుగు గంటలు. బెయిల్, కూడా ఇవ్వలేదు.

ఈనాటి అందరూ అయ్యో పాపం అన్నారు. కానీ ఆనాటి వాళ్ళు మాత్రం అది పార్వతమ్మ ఉసురే అన్నారు! సాంబయ్య ఉలిక్కిపడి చూశాడు! ఒరేయ్ సాంబయ్యా పాలు పోసిన చేతిని పాము కూడా కాటేయ్యదురా! నా భర్త ఉప్పు తిని నాకే అన్యాయం చేస్తావురా? అనుభవించు అనుభవించు!.... నా ఉసురు నీకు తగలదనుకున్నావా? "అమ్మగారూ అమ్మగారూ!" పిచ్చివాడిలా అరుస్తున్న సాంబయ్యని డాక్టరు దగ్గరకి తీసికెళ్ళాడు జైలు సూపరింటెండెంటు.

పదిమందికి చందాలిచ్చి, ప్లాట్ ఫారం మీద ఉపన్యాసాలిచ్చి, పేరు పేపర్లో వేయించుకోగానే సరా? మోసం మోసమే. ఎందరిని దగా చేసినా అయిన వాళ్ళందరినీ నమ్మించినా, ఆత్మ పీడించదూ? జీవితాంతం వేధించదూ? ఎవరో అంటున్న మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి సాంబయ్యకి తల వంచుకుని నడుస్తున్నాడు దోషిలా....! పిచ్చివాడిలా!....